క్లుప్తంగా

బాధిత కుటుంబానికి బీమా అందజేత



మృతుడి కుటుంబానికి బీమా సొమ్మును అందిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ శివారు కోన పాపపేటకు చెందిన ఉప్పాడ బంగారి ఇటీవల మృతి చెందాడు. శనివారం అతని కుటుంబాన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు పరామర్శించారు. వైఎస్సార్ బీమా సొమ్ము రూ.5 లక్షలు మృతుడి భార్యకు అందించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగిలి బాబ్జి, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కంబాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ విద్యార్థులకు బహుమతులు



పిఠాపురం డిగ్రీ కళాశాలలో విజేతలను అభినందిస్తున్న అధ్యాపకులు

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయి బహుమతులు పొందినట్టు కళాశాల ప్రిన్సిపల్ సుభాషిణి శనివారం తెలిపారు. చిరు ధాన్యాలు, పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అన్నవరం, కాకినాడల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారన్నారు. చిరుధాన్యాల వంటల తయారీలో ఎం.మహాలక్ష్మి, పోస్టర్ ప్రదర్శనలో టి.తనూష ప్రథమ బహుమతి సాధించగా, టి.శ్రీలత ద్వితీయ బహుమతి సాధించారన్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను కళాశాలలో శనివారం అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఉష, లెక్చరర్ అనంతలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని తిరుపతి శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేపట్టారు. వివిధ మార్గాల ద్వారా రూ.3,40,665 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. భక్తులకు అర్చకులు పెద్దింటి పురుషోత్తమచార్యులు, నారాయణాచార్యులు ఆశీర్వచనాలు అందించారు. సుమారు ఐదు వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్టు ఈఓ తెలిపారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు ముగిసిన శిక్షణ



కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు

సామర్లకోట: పంచాయతీ కార్యదర్శులకు ఆరు రోజుల పాటు నిర్వహించిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. రంపచోడవరం డివిజన్, కాకినాడ జిల్లా పరిధిలోని గ్రేడ్–1, గ్రేడ్ 5 కార్యదర్శులు 483 మందికి ఐదు బ్యాచ్‌లలో నిర్వహించిన రెసిడెన్షియల్ శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆరు రోజుల పాటు నేర్చుకున్న అంశాలపై రాత పరీక్ష నిర్వహించి, వారి అభిప్రాయాలు సేకరించారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, బి.ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, ఎస్‌కె మొహిద్దీన్, శ్రీదేవి, నిహారిక పాల్గొన్నారు.

3న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 3న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సంజీవరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరానికి ఇంకా మిగిలి ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు డిప్లమో ఇన్ సివిల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరవచ్చన్నారు. స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలన్నారు. మరిన్ని వివరాలకు 94901 06530 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

పేదలకు వరం ఆరోగ్య సురక్ష

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పిఠాపురంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు ఓ వరమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం, పిఠాపురం, గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యాన్ని ప్రజల ముంగిటకే తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రతి గ్రామం, పట్టణాల్లో 45 రోజుల పాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఎవరికి ఏ ఆరోగ్య సమస్య ఉన్నా డాక్టర్లు తగిన వైద్య సేవలందిస్తారని తెలిపారు. స్పెషలిస్టు డాక్టర్లతో ప్రజలకు వైద్య సేవలందించే ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రజలకు పిలుపు నిచ్చారు. మండలంలోని పొన్నాడలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యేకు సర్పంచ్ బండి రాణి, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విశేష మార్పులు తీసుకువచ్చారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇప్పటికే గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుపై ఎల్లో మీడియా, టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. అవినీతికి పాల్పడిన చంద్రబాబుకు పవన్ కల్యాణ్ మద్దతు పలకడం హాస్యాస్పదమన్నారు. ఈ శిబిరంలో 315 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు నాగులాపల్లి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌజన్య తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, డీపీఓ విక్టర్, వైద్యశాఖ డీపీఎంఓ శ్రీనివాస్, ఎంపీడీఓ వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.



పొన్నాడలో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

మండలంలోని వాకతిప్పలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో మామిడి చిన్నయ్య దొర, చేతిపువ్వ శ్రావణి మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం

- జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి
- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి

పెద్దాపురం: రూపాయి ఖర్చు లేకుండా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభోత్సవంలో భాగంగా శనివారం పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, మండలంలోని చదలాడ గ్రామంలో సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాలకు దవులూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి తగిన వైద్యంతో పాటు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నది జగనన్న ప్రభుత్వమే అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, గోపు మురళి మాట్లాడుతూ 45 రోజుల పాటు నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత స్థానిక జేఎస్ మున్సిపల్ హైస్కూల్, మండలంలోని చదలాడలో దొరబాబు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను ప్రారంభించారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సరిత, ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఎంపీటీసీ శైల గణేష్, ఉప సర్పంచ్ వాసిరెడ్డి సూర్యావతి, శేరు వెంకబాబు, ఒబిలిశెట్టి శ్రీబాలయోగి, లక్కాకుల కృష్ణ, గవరసాని ఏసుబాబు తదితరులతో పాటు వైద్య సిబ్బంది, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దాపురంలో రోగులకు మందులు అందజేస్తున్న దొరబాబు

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా 'సురక్ష'

సామర్లకోట: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. అయోధ్యరామపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకోవడానికి ప్రతి వార్డులో వలంటీర్లు, హెల్త్ సిబ్బందితో సర్వే చేయించారని, ఎవరైనా అనారోగ్యంతో ఉంటే వారికి సురక్ష శిబిరాల్లో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని వివరించారు. ఇక్కడ నయం కాని సమస్యలు ఉంటే ఆరోగ్యశ్రీ సేవలు ఉన్న కార్పొరేట్ ఆస్పత్రులకు తరలిస్తారని ఆమె అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి జీవిత కాలం ఉండేలా ప్రజలు ఆశీర్వదించాలని, నియోజకవర్గం నుంచి పోటీ చేసే స్థానిక నాయకుడు దవులూరి దొరబాబును గెలిపించి సీఎంకు బహుమానం ఇవ్వాలన్నారు. శిబిరం కోఆర్డినేటర్ యార్లగడ్డ బంగారుశ్రీ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఏడు వేల మందిని వైద్య పరీక్షలకు గుర్తించామని, ఈ శిబిరంలో 400 మందికి వైద్య సేవలు అందించినట్టు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అధ్యక్షత వహించగా వైద్యులు సంజీవ్, తిరుమలాదేవి, జ్యోతి, భవ్య, రేహామంత్‌లు వైద్య సేవలందించారు. వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, గోకిన సునేత్రదేవి, అధికార పార్టీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.



సామర్లకోటలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

వీకే రాయపురంలో....

మండల పరిధిలో వీకే రాయపురంలో ఏర్పాటు చేసిన సురక్ష శిబిరాన్ని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ప్రారంభించారు. ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఎంఈఓలు వైశివరామకృష్ణయ్య, పి . పుల్లయ్య, గ్రామ సర్పంచ్ మోర్త పూర్ణిమ, ఉపసర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు ఉటా వాసు, ఎంపీటీసీ సభ్యుడు శివకోటి శివరామ కృష్ణ, హెల్త్ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. వైద్యులు ప్రశాంత్, శ్రీహిమవతి వైద్య పరీక్షలు చేశారు.

ప్రజా సమస్యలపై గరంగరం

- అధికారుల తీరుపై మండిపడిన కౌన్సిలర్లు
- వాడీవేడిగా గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని చెరువులు కలుషితమవుతున్నా పట్టించుకోకపోతే ఎలా అంటూ పలువురు కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు, 17వ వార్డు కౌన్సిలర్ గంధ్రేటి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ మత్స్యశాఖ ద్వారా లీజుకు ఇస్తున్న రంగప్ప, రాజు చెరువుల్లో పశువ్యర్థాలు వేయడం వల్ల నీటితో పాటు పరిసరాలు కలుషితమవుతున్నాయన్నారు. ఆ నీటిని తాగిన పశువులు వ్యాధుల బారిన పడుతున్నాయని, వెంటనే లీజు రద్దు చేయాలని అధికారులకు సూచించారు. రెండు చెరువుల వల్ల నగర పంచాయతీకి రూ.2 లక్షల ఆదాయం వస్తున్నప్పటికీ ప్రజలకు ఇబ్బందిగా మారినందున తక్షణమే లీజు రద్దు చేయాలన్నారు. 12వ వార్డు కౌన్సిలర్ గుల్ల సుబ్బారావు మాట్లాడుతూ తమ వార్డులో వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని, ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. 4వ వార్డు కౌన్సిలర్ బెందుకుర్తి సత్తిబాబు మాట్లాడుతూ తమ వార్డులో వాటర్ ట్యాంకులు తిరుగుతున్నాయని, వాటికి సంబంధించిన సమాచారం తనకు చెప్పడం లేదన్నారు. వార్డులో ఏ కార్యక్రమం జరిగినా తనకు తెలియనివ్వడం లేదని అధికారులు తనను కించపరిచేలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ శ్మశాన వాటికను కంపోస్టు యార్డుగా మార్చేశారని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. దీనిపై కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్సీ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.34 లక్షలతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామన్నారు. 10వ వార్డు కౌన్సిలర్ మొగలి దొరబాబు మాట్లాడుతూ విష్ణాలయానికి వెళ్లే మార్గంలో ఆక్రమణలు పెరిగిపోయినా పట్టించుకోవడం లేదని అధికారుల తీరుపై మండిపడ్డారు. ఆక్రమణదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని టీపీఓ వలీప్రియను కమిషనర్ ఆదేశించారు. దీనిపై టీపీఓ వలీప్రియ మాట్లాడుతూ అక్కడ ఆక్రమణలు లేవని, రాత్రి సమయాల్లో ఏమన్నా పెడుతున్నారేమో చూసి అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. దీనిపై కౌన్సిలర్లు స్పందిస్తూ ఆక్రమణలపై అధికారులకు జవాబుదారితనం లేదన్నారు. గతంలో 12వ వార్డులో ప్రతిష్టాత్మకంగా ఆక్రమణలు తొలగించామని, అధికారులు పట్టించుకోపోవడంతో మళ్లీ పెరిగిపోయాయన్నారు. ఆక్రమణలతో వీధుల్లో ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని 17వ వార్డు కౌన్సిలర్ గంధ్రేటి శ్రీరామచంద్రమూర్తి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ త్వరలో అధికారులతో సమావేశం నిర్వహించి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోట పర్యటన ఖరారు కావడంతో కలెక్టరు కృతికా శుక్లా పట్టణంలో ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుతో కలసి పర్యటిస్తూ పనులను వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలు, పైలాన్, పార్కులు, అంతర్గత రహదారులకు సంబంధించిన పనుల పురోగతిని పరిశీలించి అధికారుల నుంచి వివరాలు సేకరించారు. హెలిప్యాడ్, జగనన్న లే అవుట్ కాలనీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించే బహిరంగ సభ ప్రదేశాన్ని ఆమె పరిశీలించారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఏపీడీ వసంతమాధవి, హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో జగనన్న కాలనీని పరిశీలించిన కలెక్టర్ కృతికా శుక్లా, దవులూరి దొరబాబు తదితరులు

గ్రామాల్లో గణపతి నిమజ్జనాల సందడి



చేబ్రోలులో బుల్లి ట్రాక్టర్‌పై భారీ బొజ్జ గణపయ్యను ఊరేగిస్తున్న భక్తులు



రైల్వే స్టేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్న దవులూరి దొరబాబు

పిఠాపురం: గణపతి నవరాత్రులు ముగియడంతో గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వివిధ వాహనాల్లో తీన్‌మార్ డ్యాన్సులు, బాణసంచా కాల్పుల నడుమ గణపతిని ఊరేగించి నిమజ్జనం చేస్తున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాన్ని శనివారం చిన్న ట్రాక్టర్‌పై ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించడంతో అందరు ఆశ్చర్యంగా తిలకించారు.

రైల్వే స్టేషన్ సెంటర్‌లో అన్నదానం

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్‌లో శ్రీవర సిద్ధి వినాయక తోపుడు బండ్ల వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం భారీ అన్నదానం జరిగింది. గణపతి నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భక్తులు రోడ్డుపైకి బారులుతీయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. వర్తక సంఘం నాయకులు అత్తిలి రఘు, దాసరి నాని, నైట్ హోటల్ సత్తిబాబు, జిలకర్ర బాబురావులతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కౌన్సిలర్లు భక్తులకు సేవలందించారు.

కొనసాగుతున్న నిమజ్జనాలు

గణేష్ నిమజ్జనాలు శనివారం కొనసాగాయి. పట్టణ, మండల పరిధిలో ఏర్పాటు చేసిన విగ్రహాలతో పాటు పెద్దాపురం మున్సిపాలిటీ, మండల పరిధిలో అనేక గ్రామాల నుంచి గణేష్ విగ్రహాలను స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర ఆలయ ముఖ ద్వారం వద్ద ఉన్న గోదావరి కాలువ రేవు వద్దకు తీసుకువచ్చి నిమజ్జనాలు చేస్తున్నారు. సీఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై మూర్తి, సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

పని చేయని కాంట్రాక్టర్లపై చర్యలేవీ ?

- అధికారులను నిలదీసిన కౌన్సిల్ సభ్యులు
- చేసిన పనికీ బిల్లులు పెట్టడం లేదని నిలదీత
- అజెండాలో అంశాలకు ఏకగ్రీవ ఆమోదం



అధికారుల తీరును ప్రశ్నిస్తున్న వైస్ చైర్మన్, సభ్యులకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

సామర్లకోట: టెండర్లు వేసి, వర్క్ ఆర్డర్ పొంది పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లతో పాటు, మధ్యలో పనులు నిలిపేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొవాలని వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పెండ్యాల నాగ వెంకటలక్ష్మి, నేతల హరిబాబు, పిట్టా సత్యనారాయణ డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు జరిగాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు వేగంగా చెల్లింపులు జరుగుతున్నా పనులు చేయడం లేదని ఆవాల లక్ష్మీనారాయణ ఆరోపించారు. గడపగడపకూ నిధులతో పాటు, 14వ ఆర్థిక సంఘ నిధులతో పనులు జాప్యం చేస్తున్నారని కానేటి రాజేశ్వరి, జట్ల మోహన్, కరణం రాజ్‌కుమార్ ఆరోపించారు. దాంతో వైస్ చైర్మన్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చి నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయనివారిని బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. అలాగే కాంట్రాక్టర్లు చేసిన పనులకు సంబంధించి బిల్లులు పెట్టని అధికారులపై చర్యలు తీసుకోవాలని రెడ్నం సునీత డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిషనర్ జె.రామారావు బదులిస్తూ పనులను పరిశీలించి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో టెండర్లు వేసిన కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ సూచించారు. 22వ వార్డులో పాఠశాల సమస్యను అజెండాలో పెట్టకపోవడంపై కౌన్సిలర్ పితాని కృష్ణ ప్రశ్నించారు. ఈ పాఠశాలను కలెక్టర్ పరిశీలించిన తరువాత ప్రభుత్వానికి నివేదిక పంపామని, అద్దె భవనంలో ఉంటున్న పాఠశాలకు వార్డులో స్థలం ఉన్నా నాడు–నేడులో ఎందుకు దృష్టి పెట్టలేదని వైస్ చైర్మన్ అధికారులను ప్రశ్నించారు. మున్సిపాలిటీ సాధారణ నిధులు ఖర్చు చేసేలా వచ్చే సమావేశం అజెండాలో పాఠశాల అంశం తీసుకురావాలని ఆయన సూచించారు.

అనధికార కుళాయిలకు పన్నులు వేయాలి

గత మున్సిపల్ కౌన్సిల్ పాలనలో పట్టణ పరిధిలోని అనధికార కుళాయిలకు, ఇంటి పట్టా ఉండి ఇళ్లు కట్టుకున్న వారికి పన్నులు వేయాలని సభ్యులు నేతల హరిబాబు, పాగా సురేష్‌కుమార్ సూచించగా కమిషనర్ అందుకు హామీ ఇచ్చారు. టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని కరణం రాజ్‌కుమార్ సూచించారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ డీఈ అనంతలక్ష్మి, మేనేజర్ అచ్యుతరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో మార్పులతో ఉత్తమ ఫలితాలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- రమణక్కపేటలో జ్యోత్స్నకు సత్కారం




జ్యోత్స్నను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురావడం వల్లనే పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువులు చదువుతున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన దడాల జ్యోత్స్న అమెరికా పర్యాటన ముగించుకుని స్వగృహానికి చేరుకుంది. కాగా శనివారం ఆమెను ఎమ్మెల్యే పెండెం దొరబాబు పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోత్స్నను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి ఆంగ్ల మాధ్యమం తీసుకుకావడంతో పేద విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. జ్యోత్స్న తమ నియోజక వర్గానికే కాకుండా జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిందని కొనియాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆంగ్ల విద్యా బోధన ప్రవేశపెట్టడం వల్లనే తనకు అంతర్జాతీయ సదస్సులో ప్రసంగించే అవకాశం వచ్చిందని జ్యోత్స్న తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైఎస్సార్ రాష్ట్ర కార్యదర్శి మొగిలి బాబ్జీ, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు అనాల సుదర్శన్, మాజీ సర్పంచ్ మేరుగు ఆనంద్, నేరెళ్లరెడ్డి, కె.శ్రీరామ్, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో బాల్య వివాహాల నిర్మూలన

- ఆర్డీఓ జేఎస్ రామారావు



మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: బాల్య వివాహాలను అరికట్టడంలో అధికారుల పాత్ర కీలకమైనదని ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజనల్ స్థాయిలో బాల్య వివాహాలు, నిరోధక చట్టం నియమాలు 2023 అంశంపై ఆయన సమీక్షించారు. బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, ఆయా ప్రాజెక్టుల సీడీపీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా స్టేషన్ ఆవరణ

- రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్



ప్రయాణికులకు క్లాత్ కవర్లు పంపిణీ చేస్తున్న రైల్వే అధికారులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణ అంతా ప్లాస్టిక్ నిషేధ ప్రాంతాలుగా తయారుకావాలని స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాలలో భాగంగా శనివారం స్టేషన్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు ప్రయాణికులకు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి క్లాత్ సంచులను పంపిణీ చేశారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్ కిశోర్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టరు రామకృష్ణ, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు

కాకినాడ సిటీ: జిల్లాలోని కళాకారులు గుర్తింపు కార్డుల జారీ నిమిత్తం ఈ నెల 5వ తేదీలోపు తమ వివరాలను పంపాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి.నాగార్జున శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు నూతన గుర్తింపు కార్డు జారీ చేసేందుకు నిర్ణయించిందన్నారు. కళాకారులు తమ పేరు, పుట్టిన తేదీ, బ్లడ్ గ్రూప్, కళారూపం, ఎన్ని సంవత్సరాల అనుభవం, ఆధార్‌నంబర్, అడ్రస్ వివరాలతో ఏ4 సైజ్ కాగితంపై స్పష్టంగా తెలిసే విధంగా నమోదు చేసి ఈ కార్యాలయ పని వేళల్లో కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తులు పంపాలని నాగార్జున కోరారు.